ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

నల్లగొండ

3

గురువారం 11 జూలై 2024

గరిష్ఠం 32.0
కనిష్ఠం 22.2



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	503.90 (121.5462)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.49 (2.67)	నిల్	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	98.42 (0.65)	50	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.138 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240

- గత తప్పిదాలు పునరావృతం కావద్దని..
- ప్రయాణాలు సులభతరం కావాలని..
- ఏ ఒక్కరూ చనిపోవద్దని విన్నపం
- విస్తరణపై వెల్లువెత్తుతున్న ప్రజల సూచనలు
- అండర్‌పాసింగ్‌లు, బ్రిడ్జిలు, వీయూవీల కోసం డిమాండ్లు
- గ్రీన్ హైవేగా మార్చాలని సూచన

ప్రమాదాల నివారణకు ఫ్లైఓవర్లే పరిష్కారం

ఆరు వరుసలుగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి ● సూత్రప్రాయంగా అంగీకరించిన కేంద్ర ప్రభుత్వం



చిట్యాల మండలం వెలిమినేడు సమీపంలో ప్రమాదకర క్రాసింగ్

దేశంలో రద్దీ రహదారిగా మారి నిత్యం నెత్తురోడుతున్న అప్పటి హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(9)ని 2009లో నాలుగు లేన్ల రహదారిగా విస్తరించారు. దారి పెరిగినా రోడ్డుపై ప్రమాదాల దారుణాలు మాత్రం తగ్గలేదు. వాహన రాకపోకలు పెరగడంతో పాటు నిర్మాణ సమయంలో సాంకేతిక సమస్యలతో పాటు స్థానికుల డిమాండ్లకు తలొగ్గి నిర్మాణం మార్చడంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఈ తరుణంలో 15 ఏళ్ల తర్వాత మరోసారి వాహన రద్దీకి తగ్గట్టుగా ఈ మార్గాన్ని ఆరు వరుసలకు విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈ మేరకు ప్రణాళికలు కూడా రూపొందిస్తోంది. ఇందుకోసం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర మంత్రి నిత్కన్ గడ్కరిని కలిసి పలుమార్లు విన్నవించారు. ఈ నేపథ్యంలో రహదారి విస్తరణపై స్థానికుల అభిప్రాయాలు, అవసరాలు, అంచనాలను పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నారు. ఎక్కడా రోడ్డు క్రాసింగ్ లేకుండా ఫ్లైఓవర్లు, అండర్ పాసింగ్‌లు, వీయూవీలు నిర్మించాలని కోరుతున్నారు. గతంలో జరిగిన తప్పులు జరుగకుండా ఏ ఒక్కరి ప్రాణం పోకుండా ప్రమాదరహితంగా రహదారి నిర్మాణం చేపట్టాలని ఆశిస్తున్నారు.


హైదరాబాద్ - విజయవాడ నగరాల మధ్య ఉన్న జాతీయ రహదారి డెత్ రోడ్‌గా మారింది. జాతీయ రహదారిని ఆరులేన్లుగా మార్చి ప్రమాదాలను నివారించాలని పలుమార్లు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విన్నవించాను. ఆరు నెలల్లో ఆరులేన్లుగా మారబోతోంది. హైదరాబాద్ నుంచి విజయవాడకు ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా కేవలం 2గంటల వ్యవధిలో చేరవచ్చు.

-కొర్లపహాడ్‌లో ట్రామాకేర్ సెంటర్ భూమిపూజ సందర్భంగా మంత్రి వెంకట్‌రెడ్డి

వివరాలు 5లో

ప్రాజెక్టుల పూర్తికి మంత్రుల కృషి అభినందనీయం

● శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): నల్లగొండ ఉమ్మడి జిల్లాలో సాగునీటి పెండింగ్ ప్రాజెక్టుల పూర్తిగా జిల్లా మంత్రుల కృషి అభినందనీయమని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన నల్లగొండలోని తన నివాసంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఎస్‌ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టుల పూర్తికి ఇద్దరు మంత్రులు చొరవగా పనిచేస్తున్నారని, ఏడాదిలోగా ఈ పథకాలను పూర్తిచేయించడం ద్వారా జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు వారు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఎల్ఎస్‌బీసీ సొరంగం కేవలం 9.5 కిలోమీటర్లు మాత్రమే పెండింగ్‌లో ఉందని, అది పూర్తయితే దాదాపు 4.05లక్షల ఎకరాలకు శ్రీశైలం నుంచే నీటిని తీసుకునే వెసులుబాటు లభిస్తుందని వివరించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న తాను రాజకీయపార్టీల వాదోపవాదాలు, విమర్శలపై స్పందించలేనన్నారు. ఎమ్మెల్సీల పార్టీ ఫిరాయింపులపై గతంలో ఉన్న రికార్డులు, కోర్టుల తీర్పుల ఆధారంగా చర్యలుంటాయన్నారు. కృష్ణానదీజలాల విషయంలో తెలంగాణకు ఎక్కువ వాటా ఇచ్చేందుకు ఏపీతోపాటు కేంద్రమూ సహకరించాలన్నారు. తెలంగాణకు ఎత్తిపోతలే శరణ్యమైనందున ఈ పథకాల పూర్తికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



మర్రిగూడలో డీఎస్పీ, సీఐలతో మాట్లాడుతున్న ఎస్పీ

మునుగోడు, జూలై 10: శాంతిభద్రతల పరిరక్షణపై పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్ని ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశించారు. మునుగోడు పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సందర్శించారు. స్టేషన్ సిబ్బంది వివరాలు, వా రి పనితీరు, నిర్వహణ రికార్డులతోపాటు పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో కేసుల స్థితిగతులు, నేరాలు జరి గే ప్రాంతాలు, శాంతిభద్రతలు, సంఘ వ్యతిరేక కార్యకలాపాల గురించి పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నేరాలను తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. చండూరు సీఐ వెంకటయ్య, మునుగోడు ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు ఆయనవెంట ఉన్నారు.

చండూరు: పోలీసులు ప్రజలకు రోల్‌మోడల్‌గా ఉండాలని ఎస్పీ శరత్‌చంద్ర అన్నారు. చండూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. కేసులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో చండూరు సీఐ వెంటయ్య, ఎస్సై సురేష్ పాల్గొన్నారు.

మర్రిగూడ: నాంపల్లి సర్కిల్ పరిధిలోని మర్రిగూడ, నాంపల్లి పరిధిలోని పోలీస్‌స్టేషన్లను ఎస్పీ పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న క్రైం కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించుకోవాలన్నారు. నాంపల్లి సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐలు రంగారెడ్డి, లచ్చిరెడ్డి అన్నారు.

గొర్రెల డీడీల డబ్బులు వాపస్

కేతేపల్లి, జూలై 10: సబ్సిడీ గొర్రెల యూనిట్లకోసం గత ఏడాది క్రితం డీడీలు తీసిన గొర్రెల పెంపకందారులకు ప్రభుత్వం డబ్బులు వాపస్ చేసింది. మండలంలోని 16 గ్రామాలకు చెందిన దాదాపు వెయ్యి మందికిపైగా పెంపకందారులు గొర్రెల యూనిట్లకోసం వివిధ బ్యాంకుల్లో ఒక్కో యూనిట్ కోసం రూ.43,900 పైచిలుకు డీడీలు తీసి యూనిట్ల కోసం ఎదురు చూస్తున్నారు. కొందరు పెంపకందారులు ప్రైవేటు వ్యక్తుల వద్ద డబ్బు వడ్డీలకు తీసుకుని డీడీలు తీశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలతో ప్రభుత్వం మారి గొర్రెల యూనిట్లు రద్దుకావడంతో డీడీలు తీసి గొర్రెల పెంపకందారులు తీవ్ర ఆందోళనలోపడ్డారు. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన మేరకు డీడీలు తీసిన వారంతా గతనెలలో పశుసంవర్ధక శాఖ అధికారులకు డీడీల వాపస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈమేరకు ప్రభుత్వం డీడీలు తీసిన వారందరి బ్యాంకుఖాతాల్లో బుధవారం నగదు జమచేసింది. గొర్రెల యూనిట్ల డీడీల డబ్బులు వాపస్‌రావడంతో మండలవ్యాప్తంగా ఉన్న గొర్రెల పెంపకందారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

డీఈవో భిక్షపతి



ఊట్కూరు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో

నిడమనూరు, పెద్దవూర, జూలై 10: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు కచ్చితంగా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం కూడా అందించాలని డీఈవో బొల్లారం భిక్షపతి ఆదేశించారు. బుధవారం మండలంలోని ఊట్కూరు ప్రాథమిక పాఠశాలతో పాటు జడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి, పలు ప్రశ్నలు అడిగి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. ప్రతీ విద్యార్థికి నాణ్యమైన విద్యనందించేందుకు ఉపాధ్యాయులు దోహదం చేయాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించి, నాణ్యతతో పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈవో బాలునాయక్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు. అదే విధంగా పెద్దవూర మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు.

హాలియా: ప్రభుత్వ ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి అన్నారు. అనుముల మండలంలోని కేజీబీవీ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల నమోదు పెంచాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆయన సూచించారు.



బత్తాయి రైతులపై 'సాద్గుడి' పిడుగు

బత్తాయి సాగులో మూడున్నర లక్షల ఎకరాలకుపైగా విస్తీర్ణంతో దేశంలోనే మొదటిస్థానంలో ఉన్న నల్లగొండ రానురాను అధమ స్థానానికి పడిపోయింది. ప్రస్తుతం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అంతా కలిసి కనీసం 65వేల ఎకరాల్లో కూడా బత్తాయి విస్తీర్ణం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. ఓవైపు తెగుళ్ల బెడద, మరోవైపు నీటి వనరులు తగ్గడం, దిగుబడి వచ్చినప్పుడు ధర ఉండకపోవడం, ధర ఉన్నప్పుడు దిగుబడి రాకపోవడం వంటి సమస్యలను ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగం ఎదుర్కొంటుంది.

● నల్లగొండ

- నాసిరకం మొక్కలతో నిండా మునిగిన రైతులు
- పదేళ్లు కావొస్తున్నా దిగుబడి అంతంతే
- తిరుపతి వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ మొక్కలపై అనుమానాలు
- ఆర్థికంగా దెబ్బతిన్న రైతులు
- న్యాయం చేయాలని అధికారులకు వేడుకోలు
- నమూనాలు సేకరించాలని నాగపూర్ యూనివర్సిటీకి ఉద్యానశాఖ లేఖ

గత పదేళ్లలో అప్పటి ప్రభుత్వం తోటల పెంపకాన్ని ప్రోత్సహించలేదు. డ్రిప్పులను సైతం మంజూరు చేయలేదు. నూతన ప్రభుత్వంలోనూ ఒక ఆయిల్‌పామ్ సాగు మినహా పండ్ల తోటలకు ఎలాంటి ప్రోత్సాహకం కనిపించలేదు. అయితే వరికి ప్రత్యామ్నాయంగా పండ్ల తోటలపై ఆసక్తి ఉన్న రైతులు బత్తాయి తోటలపై మమకారంతో అక్కడక్కడ బత్తాయి తోటలను పెడుతున్నారు. అయితే హార్టికల్చర్ శాఖ నుంచి ఎలాంటి ప్రోత్సాహకం లేకపోవడంతో రైతులు సొంత పెట్టుబడులతో ముందడుగేస్తుండగా కొంత మంది ఆర్థికంగా ఉన్న రైతులు నిలదొక్కుకుంటే పేద, మధ్య తరగతి రైతులు మాత్రం పండ్ల తోటలను పెట్టి నష్టాలు చవిచూస్తున్నారు. తాజాగా జిల్లాలో నాసిరకం మొక్కలను వేసి గత పదేళ్లు కావొస్తున్నప్పటికీ దిగుబడి రాకపోవడంతో లబోదిబోమంటున్నారు.

నాసిరకంతో కూడిన మొక్కలు

నల్లగొండ జిల్లాలోని తిప్పర్తి, నల్లగొండ, కనగల్, గుర్రంపోడు, నిడమనూరుకు చెందిన రైతులు గత పదేళ్లక్రితం ఏపీ రాష్ట్రంలోని తిరుపతికి చెందిన డాక్టర్ వైఎస్ఆర్ యూనివర్సిటీలో బత్తాయి మొక్కల నర్సరీనుంచి మొక్కలను కొనుగోలుచేశారు. ఒక్కో మొక్కకు రూ.70నుంచి రూ.80వరకు వెచ్చించి తమ భూ ముల్లో నాటారు. తిరుపతి యూనివర్సిటీ నుంచి తెచ్చిన మొక్కలు పెరిగి పెద్దగా అయినప్పటికీ కాత నిలబడకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వాస్తవానికైతే బత్తాయి మొక్కలు నాటిన తర్వాత నాలుగు నుంచి నాలుగున్నరేళ్ల వయస్సు వచ్చే సరికి కాపు రావాల్సి ఉంటుంది. విచిత్రమైన పరిస్థితులు ఏమిటంటే పూత బాగానే ఉంటున్నప్పటికీ కాత నిలబడటంలేదు. ఉదాహరణకు ఒక్క చెట్టుకు 100 పూలు ఉంటే 80 పూలు రాలిపోవడం గమనార్హం. దీంతో రైతులు ఎటూ పాలుపోక అధికారుల చుట్టూ, శాస్త్రవేత్తల చు ట్టూ తిరిగివేసారి పోయారు. అధికారులు, శాస్త్రవేత్త లు తోటలు సందర్శించి పలు సూచనలు, సలహాలు ఇవ్వడంతోపాటు మందులు కూడా పిచికారీ చేయించారు. పూత మాత్రం నిలబడలేదు. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రాయలసీమలోని తిరుపతి ప్రాంతంలో వైఎస్ఆర్ యూనివర్సిటీ పరిధిలో తిరుపతి, వెంకటగిరి, మహానంది, అనంతపురంలో బత్తాయి మొక్కల రీసెర్చ్ స్టేషన్లున్నాయి. ఈకేంద్రాల నుంచి రైతులు రంగాపూర్(సాద్గుడి) జాతి బత్తాయి మొక్కలను అత్యధికంగా కొనుగోలు చేస్తుంటారు.వాస్తవానికయితే యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలో పండ్ల తోట రైతుల సంఖ్య తక్కువగా ఉండగా నల్లగొండ జిల్లాలోనే అత్యధికంగా బత్తాయి సాగుచేసిన రైతులున్నారు. ఆయా కేంద్రాల నుంచి అత్యధికంగా నల్లగొండకు చెందిన రైతులే మొక్కలు సాగు చేస్తున్నారు. ఈయూనివర్సిటీ మొక్కలపై నమ్మకం లేక అనంతపు రం, కడపకు చెందిన రైతులు జంబేరా రకం మొక్క లు సాగు చేస్తున్నట్లు సమాచారం. స్థానిక రైతులు ఇతర జాతుల మొక్కలనువేసి బయటపడగా నల్లగొండ జిల్లా రైతులు మాత్రం ఆ రీసెర్చ్ సెంటర్లపై నమ్మకంతో కొనుగోలుచేసి తీవ్రంగా నష్టపోయారు.





అదనపు కలెక్టర్ పూర్ణచంద్రకు ఫిర్యాదు చేస్తున్న రైతులు (ఫైల్)

నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి



తిరుపతి రీసెర్చ్ స్టేషన్లతోపాటు అనుబంధ రీసెర్చ్ స్టేషన్లనుంచి బత్తాయి మొక్కలను కొనుగోలు చేశాం. అయితే అవి నాసిరకంకావడంతో దిగుబడి రాక రైతులంతా నష్టపోయారు. తెలంగాణ ప్రభుత్వం చొరవ తీసుకొని విచారణ జరిపించి ఆయా యూనివర్సిటీ నుంచి కొనుగోలు చేసిన రైతులకు న్యాయం చేకూర్చాలి.రంగాపూర్ సద్గుడి మొక్కలపై సెంట్రల్ రీసెర్చ్ స్టేషన్ అయిన నాగపూర్ కమిటీని ఏర్పాటు చేసి విచారణ జరిపించాలి. దిగుబడి రాకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకపోయారు.

- శ్రీనివాస్ రెడ్డి, తిప్పలమ్మగూడెం, తిప్పర్తి

బత్తాయి దిగుబడి రావడం లేదు



తోటలు పెట్టి ఏళ్లు గడుస్తున్నా దిగుబడి రావడంలేదు. దీంతో నష్టాలు వాటిల్లుతున్నాయి. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపించి రైతులకు న్యాయంచేయాలి. రంగాపూర్ రకానికి చెందిన మొక్కలు దిగుబడి రాకపోవడంతో ఆ మొక్కలు పెట్టిన రైతులు నష్టపోయారు. యూనివర్సిటీ మొక్కలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి రైతులను ఆదుకోవాలి. నాసిరకం మొక్కల వల్లనే దిగుబడి పడిపోయింది.

- శ్రీనివాస్ రెడ్డి, ఎర్రబెల్లి, నిడమనూరు

నాగపూర్ రీసెర్చ్ సెంటర్‌ను సంప్రదించాం



ఇటీవల పలువురు రైతులు నాసిరకం మొక్కల గురించి తమ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై సెంటర్ రీసెర్చ్ స్టేషన్ అయిన నాగపూర్ శాస్త్రవేత్తలకు పలు అంశాల గురించి లేఖరాశాం. శాస్త్రవేత్తలు తోటలను సందర్శించి పరిశీలన చేయాలని కోరాం. నాసిరకం అయిన మొక్కలవల్ల దిగుబడి రావడం లేదా ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా? అనే దానిపై టెక్నికల్‌గా శాస్త్రవేత్తలు డీఎన్ఏ పరీక్షలతోపాటు ఆకుల అనాలసిస్, బత్తాయి కాయల అనాలసిస్ చేసి పరిస్థితులను తెలియజేస్తారు.

- సంగీత లక్ష్మీ, ఉద్యానశాఖ అధికారి, నల్లగొండ

పదేళ్లు కావొస్తున్నా కానరాని దిగుబడి

పదేళ్లు తోట పెంచి ఎంతో ఆశలు పెట్టుకున్న రైతులకు అడియాసే మిగిలింది. రంగాపూర్ సాద్గూడి (నిమ్మజాతి వేరుమూలం, బత్తాయి అంటు) రకం మొక్కలు వేసిన రైతులు పదేళ్లనుంచి ఎలాంటి దిగుబడి లేక నష్టాలు చవి చూస్తున్నారు. వాస్తవానికయితే ఒక్కో చెట్టుకూ 30 నుంచి 50కిలోల దిగుబడి రావాలి. కానీ 10 కిలోలకు మించి కాయ దిగుబడి రావడంలేదు. దీంతో పలువురు రైతులు అనంతపురం చెందిన శాస్త్రవేత్తలను సంప్రదిస్తే ఆ శాస్త్రవేత్త ఎనిమిదేళ్ల తర్వాతే దిగుబడి వస్తుందని చెప్పడంతో ఖంగుతిన్న రైతులు తాము పదేళ్ల కిందే తోటలు పెట్టామని అయిన దిగుబడి రావడం లేదని ఆ శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లారు. అయినా శాస్త్రవేత్తలు కూడా ఈ సమస్యకు పరిష్కారాన్ని తీసుకురాలేదు. ఇటీవల జిల్లాకు చెందిన రైతులు అదనపు కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లి విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఇదిలా ఉంటే మొక్కలు నాసిరకంగా ఉన్నాయా? ఇంకా ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా? దానిపై శాస్త్రవేత్తలు మొక్కల డీఎన్ఏ టెస్ట్‌తోపాటు లీఫ్ అనాలిసిస్, ఫ్రూట్ అనాలిసిస్ట్ చేస్తే అసలు సమస్య ఏమిటనేది వెలుగులోకి రానుంది. తిరుపతి యూనివర్సిటీ నుంచి మొక్కలు కొనుగోలుచేసి అవి నాసిరకంగా ఉండటంతో దిగుబడి రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకపోయారు. బాధిత రైతులు ఇప్పటికే ఆమొక్కలను పరిశీలించి నాగపూర్ యునివర్సిటీకి పంపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే జిల్లా ఉద్యానశాఖ అధికారులు నాగపూర్ రీసెర్చ్ స్టేషన్ లేఖరాసి మొక్కలను పరిశీలించాలని కోరారు. ఇకపోతే గురువారం నాడు జిల్లాకు చెందిన రైతులు వ్యవసాయశాఖ మంత్రితోపాటు రాష్ట్ర హార్టికల్చర్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

ప్రజలందరూ భక్తిమార్గంలో నడవాలి

ఎమ్మెల్యే బాలునాయక్, ప్రభుదాస్ స్వామి

దేవరకొండలో పూరిజగన్నాథ్ రథయాత్ర



పూరిజగన్నాథ రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జూలై 10: ప్రజలు భక్తిభావాన్ని పెంచుకొని భక్తిమార్గంలో నడవాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, పూరిజగన్నాథ్ రథయాత్ర నిర్వాహకులు స్వామి ప్రభుదాస్ అన్నారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి దేవరకొండకు చేరుకున్న పూరిజగన్నాథ్ యాత్రకు దేవరకొండ అయ్యప్పస్వామి దేవాలయ నిర్వాహకులు, భక్తులు భారీగా స్వాగతం పలికారు. అయ్యప్పస్వామి దేవాలయం వద్దకు చేరుకున్న రథయాత్ర జగన్నాథునికి పూజలు చేసిన అనంతరం దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ప్రత్యేక పూజలుచేసి రథయాత్ర ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలూనాయక్, రథయాత్ర నిర్వాహకులు స్వామి ప్రభుదాస్‌లు మాట్లాడుతూ పూరిజగన్నాథుని కటాక్షంతో దేశం సుభిక్షంగా ఉండాలన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులకు పంటలు పండాలని, ప్రాజెక్టులు నిండాలని దేవుడిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం కోలాటాలు, భజనలతో స్వామివారి రథయాత్ర ఊరేగింపు మీనాక్షి సెంటర్, బస్టాండ్ మీదుగా కొండల్‌రావునగర్ వరకు సాగింది. కార్యక్రమంలో అయ్యప్పస్వామి దేవాలయ కమిటీ ఛైర్మన్ చిలువేరు చంద్రమౌళి గురుస్వామి, పున్న వెంకటేశ్వర్లు, మారేపాకల అరుణ సురేష్‌గౌడ్, జాల నర్సింహారెడ్డి, చీదెళ్ల వెంకటేశ్వర్లు, గాజుల మురళీ, నాగేశ్వర్‌రావు, జల్దా భాస్కర్, గుండాల అంజయ్య యాదవ్, వెంకటేష్‌యాదవ్, వడ్త్య దేవేందర్‌నాయక్, ఆర్యవైశ్యసంఘం మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. దేవరకొండ సీఐ నర్సింహులు ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

విదేశీ భక్తుల కీర్తనలు, భజనలు

దేవరకొండ అయ్యప్పస్వామి దేవాలయం నుంచి బయలుదేరిన పూరి జగన్నాథ్ రథయాత్రలో విదేశీయుల భజనలు, కీర్తనలు ఆకట్టుకున్నాయి. రథయాత్రలో విదేశీయులైన అమెరికా, లండన్‌తోపాటు వివిధ దేశాలనుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

ప్రేమ, పెళ్లి పేరుతో యువకుల వేధింపులతో ఆత్మహత్య



రామలింగంను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, కల్యాణి(ఫైల్‌ఫొటో)

మాడ్గులపల్లి, జూలై 10: ఒకే వీధిలో ఉండే ఇద్దరు యువకులు ఓ యువతిని పెళ్లి చేసుకోవాలని ఒకరు, ప్రేమించాలని మరొకరు వేధించారు. తాము చెప్పినట్లుగా వినకపోతే వాట్సాప్, ఇన్‌స్ట్రాగ్రామ్‌లో యువతి ఫొటోలను పెడతామని బెదిరించడంతో ఆ యువతి ఆత్మహత్య చేసుకుంది. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ శోభన్‌బాబు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాడ్గులపల్లి మండలం కుక్కడం ఆవాసం చింతలగూడెం గ్రామానికి చెందిన కొత్త రామలింగం రజిత దంపతులకు కుమారుడు, కుమార్తె కల్యాణి(18) ఉన్నారు. కల్యాణి పాలిటెక్నిక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేసి, ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటోంది. ఆమె స్వగ్రామంలో ఉండే వీధిలోనే ఉండే ఆరూరి శివ, కొమ్మనబోయిన మధులు కల్యాణిని ఇష్టపడుతున్నారు. వీరిద్దరూ స్థానికంగా ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. కొద్దిరోజుల కిందట కల్యాణి ఫోన్‌నెంబరును తెలుసుకున్న వారిద్దరూ ఆమెకు తరచూ ఫోన్లు చేయడం ప్రారంభించారు. ఊరితో పాటు వీధిలో ఉండేవారే కావడంతో ఆమె వారితో మాట్లాడుతోంది. దీనిని అలుసుగా తీసుకున్న శివ తనను ప్రేమించాలని, మధు తనను పెళ్లి చేసుకోవాలని అడుగుతున్నారు. ఇందుకు కల్యాణి నిరాకరిస్తుండటంతో వాట్సాప్‌లో ఆమె డీపీగా(డిస్‌ప్లే పిక్చర్) పెట్టుకున్న ఫొటోలను తీసుకుని వాటిని తమ వాట్సాప్, ఇన్‌స్ట్రాగ్రామ్‌లో స్టేటస్‌గా పెట్టుకుంటామని బెదిరిస్తున్నారు. ఇద్దరు యువకుల వేధింపులతో మనోవేదనకు గురైన కల్యాణి ఈ నెల 6వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగింది. కొద్దిసేపటికి స్థానికులు గమనించి మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మంగళవారం రాత్రి మృతి చెందింది. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల వల్లే తమ కుమార్తె మృతి చెందిందని తల్లి రజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని నల్లగొండ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు. స్వగ్రామంలో బుధవారం సాయంత్రం అంత్యక్రియలు పూర్తి చేశారు. తమ కుమార్తె మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని తల్లి రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. ఈ విషయమై ఎస్‌ఐను వివరణ కోరగా నిందితులు శివ, మధులు పరారీలో ఉన్నారని త్వరలో పట్టుకుంటామన్నారు. కల్యాణి మృతదేహాన్ని సందర్శించిన మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతి మృతి పట్ల పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, మాజీ సర్పంచ్ అలుగుబెల్లి గోవింద్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పద్మ, నాయకులు పాదూరి గోవర్ధని, రాబర్ట్, నకిరేకంటి శ్రీను, వెంకన్న, వేణు, మారయ్య, నంద్యాల వెంకట్‌రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కడుపు నొప్పితో ఇంటర్ విద్యార్థిని మృతి

నల్లగొండ క్రైం, జూలై 8 : కడుపునొప్పితో ఇంటర్ విద్యార్థిని మృతి చెందింది. నల్లగొండ టూటౌన్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దవూర మండలం నాగార్జునపేటకు చెందిన రమావత్ ఇందూ(17) కట్టంగూరు కేజీబీవీలో ఇంటర్ బైపీసీ చదువుతోంది. రెండురోజుల నుంచి కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులు నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఓ ఆసుపత్రిలో చికిత్సకోసం తీసుకొచ్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి కుటుంబం మూడేళ్ల నుంచి నల్లగొండలోని శ్రీనివాసనగర్‌కాలనీలో నివాసముంటూ కూలీపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కుమార్తె మృతితో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు డివైడర్‌ను ఢీకొని ఒకరి మృతి

చిట్యాల రూరల్, జూలై 10 : ప్రమాదవశాత్తు డివైడర్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ-2 లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైజాక్‌లోని సీతారాంపేటకు చెందిన రామనాథం సాయిరామ్(28) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. అతడి స్నేహితులు జమ్మన్న సంప్రీత్‌జోషి, తమ్మగోని చరణ్, డ్రైవర్ మీసాల వంశీ వినాయక్‌లతో కలిసి ఈ నెల 9న హైదరాబాద్ నుంచి వైజాగ్‌కు కారులో వెళ్తున్నాడు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులోకి చేరుకోగానే కారు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారు టైరు పగిలి అదుపుతప్పి పల్టీకొట్టింది. ఈ ఘటనలో సాయిరాంతో పాటు కారులో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా సాయిరామ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తండ్రి రామనాథం కాశీదాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి ...



గరిడేపల్లి, జూలై 10: బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందాడు. బుధవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి ఎస్‌ఐ ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం మునగాల మండలం తాడ్వాయి గ్రామానికి చెందిన నాగార్జునపు మధు(36) మంగళవారం ఉదయం కోదాడ నుంచి మిర్యాలగూడకు బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో గరిడేపల్లి మండలం అప్పన్నపేట శివారులో బైక్ అదుపుతప్పి పడిపోవడంతో మధుకి గాయాలయ్యాయి. అతడిని సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మధు భార్య రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు. మధుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

లొంగిపోయిన మనీష్‌రెడ్డి

చింతపల్లి, జూలై 10 : మనీ ఎంటర్‌ప్రైజెస్ స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో వెయ్యికి రెండు వేలు, లక్షకు రెండు లక్షలు ఇస్తానంటూ రూ.50 కోట్లతో ఉడాయించిన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం వేంకటేశ్వరనగర్(మాల్)కు చెందిన మదిని మనీష్‌రెడ్డి పోలీసులకు బుధవారం లొంగిపోయాడు. మొదట కొందరికి నమ్మకం కలిగేలా ఇచ్చిన మనీష్‌రెడ్డి ఆ తర్వాత చేతులెత్తేశాడు. బాధితులు డబ్బుల కోసం నిలదీయడంతో బ్రాంచ్ మూసేసి పోలీసుల వద్ద లొంగిపోయాడు.

ఆంధ్రజ్యోతి విజిట్

ఆరు వరుసలుగా హైదరాబాద్- విజయవాడ హైవే

ప్రమాదాల నివారణకు

ఫ్లైఓవర్లే పరిష్కారం

- గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం
- ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ
- గతంలో తప్పులు జరగవద్దంటున్న ప్రజలు
- అండర్‌పాసింగ్‌లు, వీయూపీలు, ఫ్లైఓవర్లతో క్రాస్‌రోడ్ల సమస్యలకు పరిష్కారంగా సూచన

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి(65)ని ఆరు వరుసలుగా విస్తరించేందుకు కేంద్రప్రభుత్వం సూత్రపాయంగా ఆమోదించింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం నుంచి మొదలై సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని రామాపురం క్రాస్‌రోడ్డు వరకు 151 కిలోమీటర్ల మేర రహదారి విస్తరించి ఉంది. ఈ రహదారిపై నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో హైవేను విస్తరించాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో బ్లాక్‌స్పాట్స్ వద్ద ప్రత్యేక నిర్మాణాలతో పాటు సర్వీస్ రోడ్లను కూడా నిర్మించి ఇబ్బందులను తీర్చాలని సమీప గ్రామాల ప్రజల డిమాండ్ చేస్తున్నారు. జంక్షన్లు, క్రాస్‌రోడ్ల వద్ద ఫ్లైఓవర్లతో పాటు అండర్‌పాసింగ్‌లను ఏర్పాటు చేయాలంటున్నారు.


హైవే ప్రారంభం వద్ద చౌటుప్పల్ మండలంలో ఆంథోల్‌మైసమ్మ దేవాలయం

చౌటుప్పల్ టౌన్ / చౌటుప్పల్ రూరల్ : హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారి యాదాద్రి భువనగిరి జిల్లాలో 23 కిలోమీటర్లు విస్తరించి ఉంది. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామసమీపంలోని 40వ కిలోమీటరు రాయి సమీపంలోని ఆంథోల్ మైసమ్మ దేవాలయం నుంచి నుంచి గుండ్లబావి గ్రామసమీపంలోని 63వ కిలోమీటరు రాయి వరకు ఉంటుంది. చౌటుప్పల్ పట్టణం మీదుగా వెళ్లే ఈ హైవేపై ఎల్లంబావి, లక్కారం గ్రామాల్లో ఫ్లైఓవర్లు, దండుమల్కాపురం వద్ద బ్రిడ్జి ఆరులేన్లతో నిర్మించి ఉన్నాయి. వీటి పరిధిని తీసివేస్తే నిర్దిష్టంగా 20 కిలోమీటర్ల పొడవున ఆరు వరసలుగా విస్తరించవలసి ఉంటుంది.

రెండు ఆలయాలు, ఒకదర్గా

హైవే విస్తరణకు రెండు దేవాలయాలు, ఒక దర్గా అడ్డంకిగా ఉన్నాయి. దండు మల్కాపురం సమీపంలోని ఆంథోల్ మైసమ్మ దేవాలయం, చౌటుప్పల్ పట్టణంలో దర్గా, ఎల్లంబావి గ్రామ సమీపంలో గణేష్ టెంపుల్ ఉన్నాయి. వీటిని పక్కకు కదిలించాల్సి రావడం ఇబ్బందితో కూడుకున్న పని.

దండు మల్కాపురం వద్ద...

ఆరులేన్ల విస్తరణతో వాహనాల వేగం పెరగనుంది. ఈ క్రమంలో పలు చోట్ల అండర్‌పాసింగ్ బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంది. నిత్యం వేలాది కార్మికులు రాకపోకలు సాగించే పారిశ్రామిక కారిడార్ దండుమల్కాపురం వద్ద బ్రిడ్జి అవసరం ఉంది. పారిశ్రామిక వేత్తల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కే సుధీర్‌రెడ్డి ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డిలను కలిసి ఫ్లైఓవర్‌ను నిర్మించాలని వినతిపత్రాలను అందజేశారు. ఈ సర్కిల్ వద్ద గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్, టెక్స్‌టైల్ పార్క్, ఆంథోల్ మైసమ్మ దేవాలయం, దండు మల్కాపురం గ్రామం ఉంది. ఇక్కడి నుంచి దేవాలయానికి సుమారు 200 మీటర్ల పొడవున వ్యతిరేక మార్గంలో భక్తులు వెళ్తుండటంతో తరచుగా ప్రమాదాలు జరుగుతుంటాయి. కార్మికులు, ఉద్యోగులు, గ్రామస్థులు హైవేను దాటాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. ఇక్కడ ఫ్లైఓవర్ ఏర్పాటు ఎంతో అవసరం ఉంది.

అండర్‌పాసింగ్‌లు లేక

హైవేపై దండుమల్కాపురం, కైరతాపురం, ఎల్లగిరి, ధర్మాజీగూడెం, పంతంగి, ఆరెగూడెం గ్రామాలకు వెళ్లే దారుల వద్ద అండర్‌పాసింగ్‌లను నిర్మించాలని ప్రజలు పదేళ్లుగా కోరుతున్నారు.

చౌటుప్పల్‌లో భారీ ఫ్లైఓవర్

చౌటుప్పల్ పట్టణంలో 2.45 కిలోమీటర్ల పొడవున ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వెళ్లే దారి నుంచి పద్మావతి ఫంక్షన్ హాల్ వరకు నిర్మాణం జరగనుంది.ఇటీవలే పనులు ప్రారంభమయ్యాయి.

ఆరు లేన్ల విస్తరణతో పాటు సర్వీసు రోడ్లు నిర్మించాలి



హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిని ఆరు వరుసల రహదారిగా విస్తరించాలని నిర్ణయించడం అభినందనీయం. ఆరు లేన్ల రోడ్డుతో పాటు జాతీయరహదారి మొత్తం సర్వీసు రోడ్లు, డ్రైనేజీ కాల్వలను నిర్మించాలి. ప్రమాద ప్రాంతాలలో పబ్లిక్ అండర్‌పాస్ బ్రిడ్జిలు నిర్మించాలి. రహదారిని గ్రీన్‌ఫీల్డ్ రహదారిగా మార్చాలి.

● రిక్కల ఇందిరాసత్తిరెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్లగిరి

● భూసేకరణ అవసరం లేదు

హైవే విస్తరణకు భూసేకరణ అవసరం లేదు. 2009లో చేసిన నాలుగు వరసల రోడ్డు విస్తరణ సందర్భంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని భూసేకరణ చేశారు. రోడ్డుకు ఇరువైపులా 100 మీటర్ల మేర భూమిని ప్రభుత్వం సేకరించింది. దీంతో ఆరు వరసలు రోడ్డు విస్తరణకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఆస్తుల యజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు.



● పచ్చదనం కనుమరుగు

ఆరులేన్ల విస్తరణతో వేలాది చెట్లు నేలమట్టం కానున్నాయి. హైవే విస్తరణ నేపథ్యంలో చెట్లను తొలగించాల్సి ఉంది. హరితహారం కింద నాడు నాటిన మొక్కలు నేడు చెట్లుగా మారి హైవేను పచ్చదనంతో నింపివేశాయి. మూడు వరసలలో పెరిగిన చెట్లలో రెండు వరసలను తొలగించవలసి ఉంటుంది.



చిట్యాల / చిట్యాల రూరల్: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం రెడ్డిబావిగూడెం వరకు ఉన్న హైవే ఆ తర్వాత నుంచి నల్లగొండ జిల్లా చిట్యాల పరిధిలోకి వస్తుంది. అక్కడి నుంచి వట్టిమర్తి క్రాస్‌రోడ్డు వరకు చిట్యాల మండల పరిధిలో సుమారు 21 కిలోమీటర్లక మేర విస్తరించి ఉంది. గుండ్రాంపల్లి, వెలిమినేడు, పెద్దకాపర్తి గ్రామాల్లో ఆరు లేన్ల విస్తీర్ణంతో గతంలోనే బ్రిడ్జిలను నిర్మించారు. ప్రధానంగా గుండ్రాంపల్లి, సుర్కంటిగూడెం, వెలిమినేడు శివారు, పెద్దకాపర్తి, చిట్యాల జంక్షన్, రైల్వేస్టేషన్ రోడ్, వట్టిమర్తి క్రాస్‌రోడ్ ప్రాంతాలను ఇప్పటికే బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఫ్లైఓవర్లను నిర్మించాల్సి ఉంది. అదేవిధంగా చిట్యాలలోని బస్టాండ్ సమీపం నుంచి ఎస్‌బీఐ కార్యాలయం వరకు ఫ్లైఓవర్ మంజూరు కాగా ఇటీవల మంత్రి వెంకటరెడ్డి శంకుస్థాపన చేశారు.

వెలిమినేడు సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద రహదారి విస్తరణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఆలయ నిర్వాహకులు, స్థానికులతో సమావేశమై తుది నిర్ణయానికి రానున్నట్లు అధికారులు తెలిపారు.

ఎనిమిది లేన్లుగా విస్తరించాలి



హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిని ఎనిమిది లేన్లుగా విస్తరించాలి. విపరీతమైన ట్రాఫిక్ ఉన్నందున భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఎనిమిది లేన్లుగా విస్తరించాలి అలాగే మెట్రో రైలు వేయడం వల్ల హైవేపై ట్రాఫిక్ తగ్గుతుంది. చిట్యాలలో బైపాస్ నిర్మించాలి.

- కుక్కల మోహన్, చిట్యాల వాసి

ప్రమాదంగా మూలమలుపు



నార్కట్‌పల్లి: చిట్యాల మండలం వట్టిమర్తి దాటగానే మొదలై ఏపీ లింగోటం వరకు నార్కట్‌పల్లి మండలంలో హైవే సుమారు 10.7 కిలోమీటర్ల విస్తరించి ఉంది. నార్కట్‌పల్లి పట్టణంలో నుంచే కాకుండా బైపాస్‌గా హైవేని విస్తరించారు. నార్కట్‌పల్లి పట్టణం ప్రారంభం నుంచి కామినేని చివరి వరకు, ఆ తర్వాత ఏపీ లింగోటం వద్ద ఇప్పటికే ఆరు లేన్ల బ్రిడ్జిలు ఉన్నాయి. నార్కట్‌పల్లి నుంచి నల్లగొండకు వెళ్లే అద్దంకి రాష్ట్ర రహదారికి పైనుంచి జాతీయ రహదారి ఫ్లైఓవర్ నిర్మించారు. హైదరాబాద్ నుంచి నల్లగొండకు వెళ్లాల్సిన వాహనాలు ప్రస్తుతం ఉన్న సర్వీస్ రోడ్డు మీదుగా వచ్చి ఫ్లైఓవర్ అండర్ పాస్ నుంచి నల్లగొండ వైపునకు తిరిగే సమయంలో కొన్ని సార్లు ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి.

రింగ్ రోడ్డును నిర్మించాలి

నల్లగొండ ఫ్లైఓవర్ వద్ద రింగ్ రోడ్డును నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు. కామినేని నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా నార్కట్‌పల్లి పట్టణం వైపునకు వచ్చే క్రమంలో ఫ్లైఓవర్ కింద నుంచి కుడి వైపునకు వెళ్లాల్సిన సమయంలో ఇటు ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డుతో పాటు నార్కట్‌పల్లి నుంచి నల్లగొండకు వెళ్లే వాహనాలు అటు నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్లాల్సిన వాహనాలు హైవేపైకి వెళ్లేందుకు సర్వీస్ రోడ్డుపైకి ఎక్కే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ఈ ప్రదేశాన్ని విస్తరించి రింగ్‌రోడ్డు వేయడం ద్వారా ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

'రోటరీ'రోడ్డు ప్రతిపాదనలను పరిశీలించాలి

నార్కట్‌పల్లి నుంచి నల్లగొండకు వెళ్లే దారిలో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద 'రోటరీ రోడ్డు'ను ఏర్పాటుచేసేందుకు గతంలో జీఎంఆర్ సంస్థ ప్రతిపాదనలు పంపగా జాతీయ రహదారి సంస్థ నిరాకరించింది. కామినేని ఆసుపత్రి సమీపంలోని వైజంక్షన్ వద్ద పదుల సంఖ్యలో మృత్యువాత పడగా ఈ ప్రదేశాన్ని బ్లాక్‌స్పాట్‌గా గుర్తించారు. ప్రమాదాల నివారణకు హైదరాబాద్ ఓఆర్‌ఆర్ వద్ద ఉన్నట్టుగానే 'రోటరీ' రోడ్డును నిర్మించేందుకు జీఎంఆర్ సంస్థ చేసిన ప్రతిపాదనలకు అప్పట్లో అంగీకారం లభించలేదు. బ్లాక్‌స్పాట్‌గా గుర్తించిన కామినేని ఆసుపత్రి వైజంక్షన్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జికే ఆమోదం తెలిపి నిర్మించారు. ఐతే ప్రస్తుతం ఆరులేన్ల విస్తరణ పనుల్లో భాగంగా నార్కట్‌పల్లి బ్రిడ్జి వద్ద రోటరీ రోడ్డు ఏర్పాటు అంశం మరోసారి పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

నకిరేకల్: నకిరేకల్ మండలంలో చందంపల్లి గ్రామం నుంచి కేతేపల్లి మండలం ఇనుపాముల జంక్షన్ వరకు మూడు కిలోమీటర్ల దూరం హైవే రోడ్డు ఉంటుంది. నకిరేకల్ బైపాస్ జంక్షన్ నుంచి ఇనుపాముల జంక్షన్ నుంచి నకిరేకల్ పట్టణానికి వాహనాలు రావాల్సి ఉంది. ఈ రెండు జంక్షన్ల వద్ద అండర్‌పాస్ లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆరు లేన్ల రోడ్డు విస్తరణ ఏర్పాటు చేస్తే సుమారు అర కిలోమీటర్ దూరం నకిరేకల్‌లోని చీమలగడ్డ ప్రాంతంలో నాలుగు లేన్ల పక్క ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సి ఆరు లేన్ల రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం కానున్నాయి. అదేవిధంగా రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణం సాఫీగా జరుగుతుంది.

ప్రమాదాలకు జంక్షన్ కట్టంగూరు

కట్టంగూరు: నార్కట్‌పల్లి మండలం ఏపీలింగోటం దాటిన తర్వాత నుంచి అయిటిపాముల శివారు వరకు హైవే కట్టంగూరు మండలపరిధిలోకి వస్తుంది. సుమారు 17 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. కట్టంగూరు శివారు నల్లగొండ క్రాస్‌రోడ్ జంక్షన్ ప్రమాదాలకు జంక్షన్‌గా మారింది. ఈ ప్రదేశం వద్ద వెహికల్ అండర్ పాస్‌ను నిర్మించాల్సి ఉంది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు, విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలకు తోడుగా నల్లగొండ జిల్లా కేంద్రం నుంచి వచ్చే వాహనాలు ఈ జంక్షన్ వద్దే కలుస్తాయి. దీంతో ఈ జంక్షన్ వద్ద తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రదేశం వద్ద రింగ్ రోడ్డు ఏర్పాటుచేసినా గాని ప్రమాదాలు జరిగే అవకాశముంది. అందుకోసం ఫ్లైఓవర్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. దీంతో పాటు అదేవిధంగా సర్వీసు రోడ్లను పూర్తి చేయాల్సి ఉంది. ఇదిలా ఉడగా ముత్యాలమ్మగూడెం, కట్టంగూరు, అయిటిపాముల బ్రిడ్జిల కిందట ఏర్పాటుచేసిన పీయూపీలను వీయూపీలుగా మార్చాల్సిన అవసరముందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ప్రధానంగా కట్టంగూరు మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన పీయూపీ చాలా ఇరుకుగా ఉండటంతో వాహనదారులతో పాటు ప్రజలు తీవ్రఇక్కట్లు పడుతున్నారు. ఇదే విషయమై గ్రామానికి చెందిన ప్రజలు అనేకసార్లు రహదారిపై రాస్తారోకో చేయడంతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. అయినా ఫలితం లేదు. జాతీయ రహదారిని ఆరులేన్లుగా విస్తరిస్తున్న క్రమంలో పీయూపీని విస్తరించాలని డిమాండ్ చేస్తున్నారు.


కట్టంగూరు శివారులోని నల్లగొండ క్రాస్‌రోడ్డు

అండర్‌పాసింగ్‌తో పరిష్కారం



కట్టంగూరు శివారులోని జంక్షన్ వద్ద అండర్‌పాసింగ్ ఏర్పాటుతోనే సమస్యకు పరిష్కారం. వీయూపీని నిర్మిస్తే రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చు. ఈ ప్రదేశం వద్ద రింగురోడ్డు నిర్మించినా ప్రమాదాలను నివారించలేం. దీంతో పాటు కట్టంగూరులో పీయూపీలను కూడా వెడల్పు చేయాలి.

- గట్టిగొర్ల సత్తయ్య, మాజీ ఎంపీటీసీ కట్టంగూరు

కేతేపల్లి : నకిరేకల్ పట్టణ శివారు నుంచి మూసీ నది పక్కన గల ఉప్పలపహాడ్ గ్రామం వరకు కేతేపల్లి మండలంలో దాదాపు 13 కిలోమీటర్ల మేర హైవే విస్తరించి ఉంది. ఈ హైవేపై ఇనుపాముల-నకిరేకల్ పట్టణాల మధ్య గల జంక్షన్ బ్లాక్‌స్పాట్‌గా ఉంది. అలాగే కొర్లపహాడ్, కేతేపల్లి, చీకటిగూడెం, ఉప్పలపహాడ్ గ్రామాల వద్ద గల జంక్షన్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ జంక్షన్‌ల వద్ద స్థానిక ప్రజానీకం కాలినడక వెళ్లడం, జీవాలు, పశువులు రోడ్డు దాటడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. అన్ని గ్రామాల్లో అండర్ పాసింగ్ వంతెనలు నిర్మించాల్సి ఉంది. దీంతో రహదారి వెంట గ్రామాల ప్రజలు హైవేపై మీదకు వెళ్లడం కుదరదు. దూర ప్రాంతాలకు అత్యంత వేగంగా వెళ్లే వాహనాలకు సైతం గ్రామాల వద్ద ఎలాంటి అడ్డంకులు లేకుండాపోనున్నాయి.


మొద్దులచెర్వు వద్ద అండర్‌పాస్ నిర్మించాల్సిన ప్రదేశం

మూలమలుపులతో, మూగజీవాల రాకతో, క్రాస్‌రోడ్లతో మునగాల మండలంలో హైవే ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. మృతుల్లో నందమూరి జానకిరాంతో పాటు ఏపీకి చెందిన ఎస్సీ, ఇతరులు ఉన్నారు. మునగాల మం డల పరిధిలోని హైవేలో సుమారు 16కు పైగా మూల మలుపులు ఉన్నాయి. ఆరులేన్ల విస్తరణలో ఈ మలుపు లను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు. వాహనచోద కుడు అలసిపోయేలా ఈ మార్గంలో ప్రయాణం ఉంటుంది.

మునగాల: మండలంలోని కొమరబండ తర్వాత కోదాడ మండలం కట్టకొమ్ముగూడెం నుంచి రామాపురం క్రాస్‌రోడ్డు వద్దకు హైవే విస్తరించింది. 10 కిలోమీటర్ల విస్తరించి ఉన్న హైవేపై ఆరు లేన్ల కోదాడ పట్టణంలోని దొరకుంట గ్రామంలో ఆరులేన్ల రహదారి ఉంది.కట్టకొమ్ముగూడెం, రామాపురం క్రాస్‌రోడ్లను ఇప్పటికే బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించారు. కోదాడ మండలంలోని ద్వారకుండ జంక్షన్, జంక్షన్ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కట్టకొమ్ముగూడెం రోడ్డు, అక్కడ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీరంగపురం, శ్రీరంగపురం నుంచి కిలోమీటర్ దూరంలో ఉన్న దుర్గపురం జంక్షన్, జంక్షన్ నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలోఉన్న చిమిర్యాల, చిమిర్యాల స్టేజీ నుంచి కిలోమీటర్ దూరంలోని నల్లబండగూడెం, అక్కడ నుంచి మరో కిలోమీటరు దూరంలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కాగా కట్టకొమ్ముగూడెం రోడ్డు వద్ద ఫ్లైఓవర్ నిర్మించాల్సి ఉందని, మిగతా స్టేజీల్లో అండర్‌పాస్‌లను నిర్మిస్తే ప్రమాదాలు జరగవని వాహనదారులు పేర్కొంటున్నారు.



అమ్మో.. జనగాం జంక్షన్

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట): నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్ గ్రామం దాటిన తర్వాత సూర్యాపేట జిల్లా పరిధిలోకి హైవే వెళ్తుంది. సూర్యాపేట పరిధిలోని రాయినిగూడెం నుంచి దురాజ్‌పల్లి వరకు 10 కిలోమీటర్ల మేర హైవే విస్తరించి ఉంది. సూర్యాపేట పట్టణం కొత్త బస్టాండ్ నుంచి ఖమ్మం క్రాస్‌రోడ్డు వరకు ఆరు లేన్ల బ్రిడ్జి నిర్మించారు. పిల్లలమర్రి, జనగాం ఎక్స్‌రోడ్డు, దురాజ్‌పల్లి వద్ద ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించారు. ఆయాచోట్ల ఫ్లైఓవర్ల నిర్మాణం చేయాల్సి ఉంది. ప్రధానంగా జనగాం క్రాస్‌రోడ్డు వద్ద వందలసంఖ్యలో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. రాత్రివేళ రోడ్డు దాటుతున్న పాదచారులతో పాటు వాహనాలు ఢీకొని పదుల సంఖ్యలో మృత్యువాతపడ్డారు. రాత్రివేళ ఇక్కడ రోడ్డుదాటడం అంటేనే ప్రజలు భయపడుతుంటారు. సూర్యాపేట పట్టణం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల నుంచి కిలోమీటర్ సర్వీస్ రోడ్డు నిర్మిస్తే మూడు టౌన్‌షిప్‌లతో పాటు కేటీఅన్నారం, కుప్పిరెడ్డిగూడెం గ్రామస్తులు ఎటువంటి భయాందోళన లేకుండా ప్రయాణం చేయవచ్చు. కిలోమీటరు దూరంలో ఉన్న టౌన్‌షిప్‌లో నివసిస్తున్న ప్రజలు, కేటీఅన్నారం, కుప్పిరెడ్డిగూడెం గ్రామస్తులు రాత్రి పూట కొద్ది దూరమేనని రాంగ్ రూట్‌లో రావడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. దురాజ్‌పల్లి జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మించాల్సిఉంది. ప్రస్తుతం నేరేడుచర్ల రహదారి వైపునకు వాహనాలు మళ్లే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదేకాక జమ్మిగడ్డ సబ్‌స్టేషన్ దగ్గర ఉన్న జాతీయ రహదారి కుడి వైపు నుంచి కేవలం అరకిలోమీటర్ లోపు రోడ్డు నిర్మిస్తే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయి. జిల్లా కేంద్రంలోని శాంతినగర్, విజయకాలనీ, దాసాయిగూడెం, ఇమాంపేట, బలరాంతండా, దుబ్బతండా, వస్త్రాంతండా, లేఖ్యతండా, ఇండస్ట్రియల్ ఏరియాలో పనిచేసే కార్మికులు ఎఫ్‌సీఐలో పనిచేసే కార్మికులకు వెసలుబాటుగా ఉంటుంది.

కోదాడ: చివ్వెంల మండలం గుంజలూరు దాటిన తర్వాత మునగాల మండలంలోకి హైవే ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి కొమరబండ బైపాస్ వరకు సుమారు 25 కిలోమీటర్ల హైవే విస్తరించి ఉంది. మాధవరం, తాడ్వాయి, మొద్దులచెర్వు, కలకోవ, మునగాల, ముకుందాపురం, ఆకుపాముల ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు. మునగాల, బరాకత్‌గూడెం వద్ద ఇప్పటికే ఆరు లేన్ల బ్రిడ్జిలు ఉన్నాయి. మాధవరం వద్ద యూటర్న్ లేకపోవటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మాధవరం నుంచి నాలుగు మీటర్ల దూరంలో ఉన్న మొద్దులచెర్వు, తాడ్వాయి, కలకోవల క్రాస్‌రోడ్ల వద్ద, అక్కడ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో మునగాల పట్టణంలోని క్రాస్‌రోడ్డు, అక్కడి నుంచి ఐదు మీటర్ల దూరంలో ఉన్న ముకుందాపురం క్రాస్‌రోడ్డు, ఆ తర్వాత మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆకుపాముల క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆయా అండర్‌పాస్‌లు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

స్థానికుల అభిప్రాయాలు తీసుకోవాలి



హైవేపై అవసరమైన చోట అండర్‌పాసింగ్‌లు నిర్మిస్తే ప్రమాదాలను నిరివారించవచ్చు. ఆరు లేన్ల విస్తరణ సందర్భంగా రహదారి వెంట గ్రామస్థుల అభిప్రాయాలను తీసుకోవాలి. ఖమ్మం-సూర్యాపేట రహదారి విస్తరణలా చేపడితే ప్రమాదాలకు ఆస్కారం ఉండదు. జాతీయరహదారిపై ఉన్న ప్రతీ గ్రామం వద్ద తప్పనిసరిగా అండర్‌పాసింగ్‌లు నిర్మించాలి.

- కనగాల నాగేశ్వరరావు, కోదాడ


దురాజ్‌పల్లి జంక్షన్

చివ్వెంల : సూర్యాపేట పట్టణ శివారు దాటిన తర్వాత చివ్వెంల మండలంలో 12 కిలోమీటర్ల మేర హైవే విస్తరించి ఉంది. వస్త్రాంతండా మొదలుకొని గుంజలూరు గ్రామం శివారు వరకు ఉన్న హైవేపై వస్త్రాంతండా వద్ద రహదారి నుంచి తండా వైపునకు వెళ్లేందుకు జంక్షన్ లేక వ్యతిరేకమార్గంలో వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. ఉండ్రుగొండ గ్రామ స్టేజీ వద్ద కాకుండా కొంచెం దూరంగా జంక్షన్ ఏర్పాటు చేయడంతో వ్యతిరేక మార్గంలో గ్రామానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. తుల్జారావుపేట గ్రామ స్టేజీ వద్ద జంక్షన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. గుంపుల వద్ద మరో జంక్షన్ ఏర్పాటుచేస్తే గ్రామస్థులకు ఇబ్బందులు తీరుతాయి. వస్త్రాంతండా, దురాజ్‌పల్లి, ఉండ్రుగొండ, పెద్దగట్టు లింగమంతులస్వామి దేవస్థానం నుంచి కాసీంపేట వరకు, తుల్జారావుపేట గ్రామాల వద్ద సర్వీసు రోడ్లతో పాటు ఫ్లైఓవర్ నిర్మాణాలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రామాపురంలో రింగ్‌రోడ్డు కావాలి

కోదాడ రూరల్ : తెలంగాణ రాష్ట్రంలో చివరి ప్రాంతం హైదరాబాద్-విజయవాడ రహదారిపై ఉన్న కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు. ఇక్కడ రింగ్‌రోడ్డు నిర్మించాలని స్థానికులు రోడ్డు విస్తరణ సమయంలోనే పనులను అడ్డుకున్నారు. అయినప్పటికీ వీలుకాలేదు. అప్పటి నుంచి ఈ ప్రాంతం నాలుగు కూడళ్ల ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది. నిత్యం సుమారు 10కి పైగా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో అనేక ప్రమాదాలు జరుగడంతో పాటు అనేక మంది మృత్యువాతకు గురవుతున్నారు. సమీపంలోని సిమెంట్ పరిశ్రమలకు సంబంధించి వందలాది లారీలు ఈ రహదారి వెంటే వెళ్తుంటాయి. దీంతో రద్దీ ఉంటుంది. ఇటీవల మూడు నెలల్లో జరిగిన 13 రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందగా 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇదిలా ఉండగా ఆరు లేన్ల విస్తరణలో భాగంగా రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద భారీ రింగ్ రోడ్డు నిర్మించనున్నట్లు సమాచారం.

రింగ్ రోడ్డు అవసరం



ఆరులేన్ల హైదరాబాద్-విజయవాడ రహదారిని ప్రమాదరహితంగా నిర్మించాలి. గతంలో జరిగిన సాంకేతిక సమస్యలకు ఆస్కారం ఇవ్వొద్దు. రహదారి వెంట గ్రామీణ ప్రజల రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా రింగ్‌రోడ్డు, సర్వీసు రోడ్లు నిర్మించాలి.

- కమతం వెంకటయ్య, రైతు

'హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు అందించాలి'

మిర్యాలగూడ, జూలై 10: హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు, నోట్ పుస్తకాలు అందించాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శులు పల్లా బిక్షం, సైదా నాయక్ కోరారు. ఆర్డీవో శ్రీనివాసరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా ఎస్సీ, ఎస్టీ బీసీ హాస్టళ్లు, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్ ట్రంకు పెట్టెలు, దుప్పట్లు ఇవ్వలేదన్నారు. స్కూళ్లలో పాఠాలు బోధిస్తున్నందున నోట్‌బుక్స్ కొనుగోలు చేసి రాసుకోలేక అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో వదూద్, జగన్, వీరన్న, వంశీ, మునీనాయక్ పాల్గొన్నారు.

దేవరకొండ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా రమేష్‌బాబు



దేవరకొండ, జూలై 10: దేవరకొండ ఆర్టీసీ డిపో నూతన మేనేజర్‌గా తల్లాడ రమేష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. దేవరకొండ డిపో మేనేజర్‌గా పనిచేసిన రాజీవ్‌ప్రేమ్‌కుమార్ మే నెలలో ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో కరీంనగర్ ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ వర్క్ మేనేజర్‌గా పని చేస్తున్న రమేష్‌బాబు దేవరకొండ మేనేజర్‌గా బదిలీపై వచ్చారు.

మృతుల కుటుంబాలకు మండలి చైర్మన్ గుత్తా పరామర్శ

దామరచర్ల, జూలై 10: మండలకేంద్రానికి చెందిన కందుల వెంకట్‌రెడ్డి అనా రోగ్యంతో బుధవారం మృతిచెందారు. మృతదేహాన్ని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. మండలంలోని తాళ్లవీరప్పగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ తల్లి రాయికింది లింగమ్మ ఇటీవల మృతిచెందగా కుటుంబసభ్యులను పరామర్శించారు. వారివెంట డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ అంగోతు లలితహాతీరాంనాయక్, నాయకులు ధనావత్ చిట్టిబాబు నాయక్, కుందూరు వెంకట్‌రెడ్డి, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, లావూరి మేగ్యానాయక్, బాల లక్ష్మీసత్యనారాయణ, సోము సైదిరెడ్డి పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ, జూలై 10: మునిసిపాలిటీ పరిధిలోని 7వ వార్డు ఎఫ్‌సీఐతో పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆ వార్డు కౌన్సిలర్ కొమ్మన నాగలక్ష్మి కోరారు. వార్డు ప్రజలతో కలిసి బుధవారం ఎఫ్‌సీఐ మేనేజర్‌కు సుకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఎఫ్‌సీఐ మొత్తం పట్టణంలోని 7వ వార్డు లో విస్తరించి ఉందన్నారు. రెండేళ్ల క్రితం అధి కారులు డ్రైన్‌ను మూసివేయడంతో వర్షాకాలంలో మురుగు నీరు వీధుల్లోకి, ఇళ్లలోకి చేరి ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా ఉందన్నారు. ఎఫ్‌సీఐ గోదాముల్లో స్టోరేజీ బియ్యం శానిటేషన్ సరిగా లేకపోవడం, సరైన జాగ్రత్తలు తీసుకోక పోవడంతో గాలివీచినప్పుడల్లా పురుగులు సమీపంపలోకి ఇళ్లలో పడి వంట పాత్రల్లోకి చేరుతున్నాయన్నారు. దీంతో వార్డు ప్రజలు పలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ఎఫ్‌సీఐ ప్రహరీ వెంట చెట్ల ముళ్లపొదలు పెరిగి పాములు, విష కీటకాలు తిరుగుతున్నాయని తెలిపారు. కోతుల చెట్లను ఆశ్రయించి ఉండి ప్రజలపై దాడి చేస్తున్నాయన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎఫ్‌సీఐ మేనేజర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాతూరి ప్రసాద్, నరేందర్‌రెడ్డి, పండు శ్రీను, కృష్ణ, అంజి, కొండలు, మల్లయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పించాలి

చండూరు, జూలై 10: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం నవీన్‌కుమార్ డిమాండ్‌చేశారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో చండూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి బుధవారం ధర్నా నిర్వహించారు. చండూరు ప్రభుత్వ పాఠశాలలో సరిపడా మంచినీరు, మరుగు దొడ్లు, బెంచీలు సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో ఇరిగి ప్రవీణ్‌కుమార్ కురుపాటి పరమేష్, కొన్‌రెడ్డి సాయి, నిఖిల్,పవన్, సైదులు, చందు, రవి, మహేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి

మర్రిగూడ, జూలై 10: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య డిమాండ్ చేశారు. వివిధ రంగాల కార్మికులు మర్రిగూడ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గమ్మ, మంజుల, భారతమ్మ, భిక్షమయ్య, మంజుల, పెరుమాళ్ల మంజుల, దుర్గమ్మ, ధనమ్మ తదితరులు ఉన్నారు.

పెద్దవూర: ఆశ, అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ, భవన నిర్మాణ కార్మికులతోపాటు ఆయా రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎస్‌కె. బషీర్, సీహెచ్. దుర్గయ్య అన్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. కార్యక్రమంలో అంజి, వంశీ, వెంకన్న, కృష్ణ, లచ్చయ్య, భిక్షమయ్య, వెంకన్న, సైదులు, రామకృష్ణ, పాపయ్య వెంకటమ్మ, సత్తమ్మ, ప్రభాకర్, శ్రీను పాల్గొన్నారు.

తిప్పర్తి: ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ రంగ సంస్థలుగా మార్చేందుకు చేసే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ మండల కన్వీనర్ బీమగాని గణేష్ డిమాండ్‌చేశారు. మార్కెట్‌యార్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పలు సంఘాల కార్మికులతో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మంత్రాల మంగమ్మ, పాలడుగు చంద్రయ్య, పార్వతమ్మ, నరాల వెంకన్న, నాగమ్మ, దానమ్మ, సైదులు, రమేష్, ఇమామ్, పద్మ, సైదమ్మ, వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.

దామరచర్ల: కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అందించాలని సీఐటీయూ మండల కన్వీనర్ భైరం దయానంద్ అన్నారు. కార్మికుల కోరికల దినం సందర్భంగా మండలకేంద్రంలో ఆయా రంగాల కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహేశ్వరి, జయమ్మ, వాడపల్లి శ్రీరాములు, నాగయ్య, జోలమ్మ, శారద, మంగమ్మ శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.



తిప్పర్తి : తహసీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న కార్మికులు

వేములపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతన చట్టం అమలు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ కోడిరెక్క వెంకన్న డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ వర్కర్లతో కలిసి వైద్యాధికారి సుచరితకు వినతిపత్రం అందజేశారు. ఎన్‌హెచ్‌ఎం స్కీం బడ్జెట్‌ను పెంచాలని, ఆశాలకు నష్టం కలిగించే పరీక్షను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వడ్డెగాని సైదులు, ఆశాలు పుట్టల విష్ణేశ్వరి, రాధిక, ఝాన్సీ రేణుక, సుజాత, రజిత పాల్గొన్నారు.

కేతేపల్లి: కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎం స్కీం కింద పని చేస్తున్న తమను కార్మికులుగా గుర్తించాలని ఆశ వర్కర్లు తహసీల్దార్ మధుసూదన్‌రెడి, మండల వైద్యాధికారికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో సీఐటీయూ మండల కన్వీనర్ ఆదిమళ్ల సుధీర్, ఆశ కార్యకర్తలు లక్ష్మి, చంద్రకళ, ఆదిలక్ష్మి, సునీత, శోభ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హమీలను అమలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఐతరాజు నర్సింహ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, రెతు భరోసా ఇవ్వాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో అరూరి శ్రీనివాస్, లడే రాములు, సుర్కంటి బుచ్చిరెడ్డి, శంకరయ్య, కోనేటి రాములు పాల్గొన్నారు.



మునుగోడులో రాస్తారోకో చేస్తున్న కార్మికులు

శాలిగౌరారం: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆశా వర్కర్లు శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రైవేటీకరణ చేయకుండా ఎన్‌హెచ్‌ఎం స్కీంలో బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. ఆశాలకు నష్టం కలిగించే పరీక్షను కేంద్ర ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ ఫెడరేషన్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బల్లెం నవనీత, రేణుక, ఉపాధ్యాక్షురాలు సైదమ్మ, బి.లక్ష్మీ, జ్యోతి, మాధవి, కవిత పాల్గొన్నారు. వైద్యాధికారిణి డాక్టర్ సూర్య శిల్పకు వినతిపత్రం అందజేశారు.

మునుగోడు: పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు, సాగర్ల మల్లేష్, జీపీ కార్మిక సంఘం నాయకుల రెడ్డిమల్ల యాదగిరి, ఎర్ర అరుణ, పెద్దమ్మ, నీల అండాలు, లక్ష్మమ్మ, మంగమ్మ, శంకర్ పాల్గొన్నారు.

లక్ష మొక్కలు నాటడమే లక్ష్యం



నర్సరీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జూలై 10: వన మహోత్సవంలో దేవరకొండ నియోజకవర్గంలో లక్ష మొక్కలు నాటడమే లక్ష్యమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని మైనంపల్లి పంచాయతీ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పెంచిన వన నర్సరీని బుధవారం పరిశీలించి మాట్లాడారు. మొక్కలు నాటి పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మైనంపల్లి మాజీ ఎంపీటీసీ సీత్యనాయక్, హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి అంబేడ్కర్, మాజీ సర్పంచ్‌లు పాండునాయక్, దీప్లానాయక్ పాల్గొన్నారు. అనంతరం మైనంపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి తరగతి గదుల మరమ్మతులను పరిశీలించారు. దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీఏపల్లి, దేవరకొండ, చందంపేట మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే బాలునాయక్ సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పల్లా నర్సింహరెడ్డి, కుక్కల గోవర్ధన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

నిడమనూరు, జూలై 10: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తానని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుంటిపల్లిలో సీసీరోడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. అనంతరం మండలకేంద్రంలో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గ్రామాలకు రోడ్లు, తాగునీరు, బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు మేరెడ్డి కేశవరెడ్డి, మేరెడ్డి వెంకట్‌రాహుల్, రంగశాయిరెడ్డి, మేరెడ్డి వెంకట్‌రాహుల్, అంకతి సత్యం, అంకతి వెంకటరమణ, బొల్లం శ్రీనివాస్, నూకల వెంకట్‌రెడ్డి, శివమారయ్య, కొండా శ్రీనివాస్‌రెడ్డి, వంశీ, గ్రామ శాఖ అధ్యక్షుడు రూపని కృష్ణయ్య, సైదాచారి, కట్టా వెంకట్‌రెడ్డి, మల్లేష్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

కార్పొరేషన్ చైర్మన్లకు పలువురి శుభాకాంక్షలు



శోభారాణికి శుభాకాంక్షలు తెలుపుతున్న రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు రూరల్, జూలై 10: రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టిన బంద్రు శోభారాణికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మహిళల అభివృద్ధి ధ్యేయంగా పనిచేసి మహిళా సాధికారత కోసం కృషిచేయాలని కోరారు.

నార్కట్‌పల్లి: వైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకమైన కాల్వ సుజాతను మండలంలోని ఎల్లారెడ్డిగూడెం వద్ద ఉన్న వాసవీ నిత్యాన్నదాన సత్రం ట్రస్టు సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. కార్పొరేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వైశ్యుల్లో ఉన్న నిజమైన పేదలను గుర్తించి వారికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సత్రం గౌరవాధ్యక్షుడు మీలా సోమయ్య, అధ్యక్షుడు రంగా శేఖర్, ఓరుగంటి పరమేశ్, జిల్ల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ముత్తినేని వీరయ్యను కాంగ్రెస్ మండల నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కోట మల్లికర్జున్‌రావు, జె.వెంకట నర్సయ్యయాదవ్, కోట పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్): షెడ్యూల్ తెగల ఆర్థిక సహకార సంస్థ(ట్రైకార్) చైర్మన్‌గా డాక్టర్ తేజావత్ బెల్లయ్యనాయక్, రాష్ట్ర వికలాంగుల హక్కుల కార్పోరేషన్ చైర్మన్‌గా ముత్తినేని వీరయ్యలను బంజారా సంఘం నాయకులు హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బంజారా సంఘం నాయకులు సక్రునాయక్, మునినాయక్, హరినాయక్, శివాజినాయక్, నరేష్‌నాయక్, సర్దార్‌నాయక్, నరేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ క్రైం: రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ముత్తినేని వీరయ్యను ఎస్సీ, ఎస్టీ, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కొండేటి నరేష్‌కుమార్, కంబాలపల్లి శ్రీకాంత్, కొండన్న ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

కట్టంగూరు, జూలై 10: సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు పిలుపునిచ్చారు. మండలంలోని కట్టంగూరు, అయిటిపాముల, ఈదులూరు, బొల్లెపల్లి ఉన్నత పాఠశాలల్లో బుధవారం సంఘం సభ్యత్వాలు నమోదు చేయించారు. రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సరెండర్ లీవు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్ బిల్లులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంమోహన్, కృష్ణ, ఉపాధ్యాయులు బద్రీ నారాయణ, హనుమంత్, పుట్ట రాములు, వెంకన్న, నాగలక్ష్మి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దు

నల్లగొండ క్రైం, జూలై 10: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని నల్లగొండ వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వన్‌టౌన్ పీఎస్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి బుధవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని, వారు ఎక్కడి వెళ్లినా తమకు సమాచారం అందుతుందన్నారు. నేర వృత్తిని వదిలి మంచి ఉద్యోగాలు, పనులు, వృత్తులు చేసుకుని జీవిస్తూ సమాజంలో గుర్తింపును తెచ్చుకోవాలన్నారు.

కౌలు రైతులకు రుణ గుర్తింపుకార్డులు ఇవ్వాలి

మర్రిగూడ, జూలై 10: కౌలు రైతులకు ప్రభుత్వం రుణ గుర్తింపుకార్డులు ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండా శ్రీశైలం అన్నారు. మండలకేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కౌలు రైతులకు రైతు భరోసా, రుణమాఫీ అందజేయాలన్నారు. సమావేశంలో యాదయ్య, రాములు, తెల్లం ముత్యాలు, కాగు వెంకటయ్య, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బండ శ్రీశైలం

గ్రామపంచాయతీ ట్రాక్టర్ చోరీ

నార్కట్‌పల్లి, జూలై 10: మండలంలోని ఎనుగులదొరి గ్రామపంచాయతీ ట్రాక్టర్ మంగళవారం అర్ధరాత్రి చోరీకి గురైంది. గ్రామ కార్యదర్శి గీతాంజలి తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాక్టర్ నెంబర్ టీఎస్05 యూఈ 1157 కాగా, ట్రాలీ నెంబర్ టీఎస్05 యూఈ 4801గా రిజిస్ట్రేషన్ అయింది. రోజు మాదిరిగానే గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కనే ఉన్న నర్సరీలో ట్రాక్టర్‌ను డ్రైవర్ మహేశ్వరం సైదులు మంగళవారం నిలిపి నర్సరీకి ఉన్న గేటు వేశాడు. బుధవారం ఉదయం చెత్త సేకరణకు నర్సరీ వద్దకు డ్రైవర్ వెళ్లి చూడగా నర్సరీ గేట్లు తెరిచి, ట్రాక్టర్ ట్రాలీ సహా కనపడలేదు. దీంతో డ్రైవర్ వెంటనే పంచాయతీ కార్యదర్శికి సమాచారమిచ్చాడు. ట్రాక్టర్ విలువ సుమారు రూ.6లక్షల వరకు ఉంటుందని కార్యదర్శి తెలిపారు. పంచాయతీ సెక్రటరీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.అంతిరెడ్డి తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి ట్రాక్టర్‌ను చోరీ చేసినట్లు నర్సరీకి ఎదురుగా ఉన్న ఓ షాపులోని సీసీ టీవీ పుటేజీల్లో నమోదైంది. ట్రాక్టర్‌ను నడుపుకుంటూ నార్కట్‌పల్లి వైపునకు తీసుకెళ్లినట్లు సీసీ పుటేజీ ద్వారా గుర్తించారు.

ప్రమాదాలు జరగకుండా చూడాలి



వివరాలు తెలుసుకుంటున్న డీఆర్‌ఎం రామకృష్ణ

చిట్యాల, జూలై10: వర్షాకాలంలో పట్టాలపై ప్రమాదాలు జరగకుండా చూడాలని గుంటూరు డివిజన్ డీఆర్‌ఎం రామకృష్ణ అన్నారు. చిట్యాల రైల్వేస్టేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. సిబ్బందికి సూచించారు. రైల్వేస్టేషన్‌లో గల సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు చికిలంమెట్ల అశోక్ గండమల్ల రాములు, దాసరి వెంకటేశ్వర్లు డీఆర్‌ఎంను కలిసి నారాయణాద్రి, శబరి, జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైళ్లను చిట్యాలలో ఆపాలని కోరారు. కార్యక్రమంలో రైల్వేసిబ్బంది అనూష, సుదర్శన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలు పుణికిపుచ్చుకోవాలి

నల్లగొండ టౌన్, జూలై 10: మహనీయుల ఆశయాలు పుణికిపుచ్చుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని బీసీ భవన్ ఎదుట ఏర్పాటు చేసిన సావిత్రిబాయి, పూలే, మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహాలను ఈ నెల 13వ తేదీన ఆవిష్కరించనున్న సందర్భంగా బుధవారం జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో నాయకులు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతున్నారని తెలిపారు. జ్యోతిరావుపూలే కుల వివక్షతను రూపుమాపేందుకు ఉద్యమించారని, మహిళల హక్కులే మానవహక్కులని తొలిసారిగా నినదించిన మహిళ సావిత్రి బాయి పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నేలపట్ల సత్యనారాయణ, కాసోజు విశ్వనాథం, కంది సూర్యానారాయణ, నల్ల సోమ మల్లయ్య, కేశబోయన శంకర్ ముదిరాజ్, కొడిదల ఎల్లంరాజు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నకిరేకల్, జూలై 10: రాష్ట్రంలో పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. నకిరేకల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో మౌళిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థిని, విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు, పుస్తకాల అక్రమ అమ్మకాలపై ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఈనెల 11వ తేదీన చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ముస్కు రవీందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ న్యాయవాదిగా నాంపల్లి నర్సింహ

నల్లగొండ క్రైం, జూలై 10: జిల్లా ప్రభుత్వ న్యాయవాదిగా నాంపల్లి నర్సింహను తాత్కాలికంగా నియమించారు. ఈ మేరకు కలెక్టర్ సి. నారాయణరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 24 సంవత్సరాలుగా నాంపల్లి నర్సింహ న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. గతంలో అదనపు పీపీగా కూడా పని చేశారు. ఈ సందర్భంగా నాంపల్లి నర్సింహ మాట్లాడుతూ ప్రభుత్వం తనకు కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పేద ప్రజలకు న్యాయం అందించే విధంగా కృషి చేస్తానన్నారు. తనకు ఈ అవకాశం కల్పించేందుకు సహకరించిన సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షులు శంకర్‌నాయక్, నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

నల్లగొండ టౌన్: నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ పీవీఎస్ నాగేశ్వర్‌రావును తెలంగాణ నీటిపారుదల శాఖ అసోసియేషన్ తరుపున శాఖ ఉద్యోగులు బుధవారం కలిశారు. ఉద్యోగుల బదిలీలు, ఇతర సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మేడి జయరావు, కార్యదర్శి వడ్ల మదుసుదనాచారి, కోశాధికారి కత్తుల మనోజ్, ప్రదీప్, సీహెచ్. మహేష్‌కుమార్, ఎండీ. అన్వర్‌పాషా, లక్ష్మీనారాయణ, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

దామరచర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి గొప్పదని ఎంఈవో బాలాజీనాయక్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ధీరావత్ బుజ్జిలింగానాయక్ అన్నారు. మండలంలోని కల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీ సందర్భంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాలోతు జనార్ధన్, మాజీ ఎంపీటీసీ ధనావత్ శారదపాచ్యునాయక్, లింగానాయక్, వెంకటేశ్వర్లు, నెహ్రూనాయక్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు గొబ్బూరి శ్రీనివాస్, గురువారెడ్డి, కవిత, శ్రీనివాస్‌నాయక్, పాషా పాల్గొన్నారు.

కట్టంగూరు: మండలంలోని అయిటిపాముల సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు ఉన్న కారణంగా ఈనెల 11న ఉదయం 7గంటల నుంచి 12 గంటల వరకు అయిటిపాముల సబ్‌స్టేషన్ పరిధిలోని అయిటిపాముల, రసూల్‌గూడెం, రామచంద్రాపురం, గంగాదేవిగూడెం, మారమ్మగూడెం, మార్తవానిగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల ఏఈ ఆర్ఎన్‌జే కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చింతపల్లి: పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో కలిశారు. గ్రామాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసేందుకు కృషి చేయాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో నాయకులు అంగిరేకుల గోవర్ధన్ గుండ్లపల్లి నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు మురళి కోరారు. మండల కేంద్రంలోని ఆదర్శ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆరేకంటి సాయిభగవత్, ఇరిగి కోటేశ్వర్, శివ, కృష్ణ పాల్గొన్నారు.

త్రిపురారం: మండల పరిధిలోని కంపసాగర్ గ్రామంలో ఉన్న ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు అంజిబాబు, రమేష్, సైదులు, విజయలక్ష్మిలను ఉపాధ్యాయులు, నేతాజీ యువసేన సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జానకిరాములు, ఉపాధ్యాయులు అంజికుమార్, వెంకన్న, హఫీజ్, వెంకటేశ్వర్లు, రవి, శివ, శశి, మధు, మహేష్ పాల్గొన్నారు.

మునుగోడు: మండల కేంద్రంలో కొద్దికాలంగా తీవ్ర అనారోగ్యంతో బుధవారం మృతిచెందిన దొమ్మాటి రాములు కుటుంబసభ్యులకు కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు ఆరెళ్ల సైదులు ముదిరాజ్ రూ.5వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చిలువేరు సుదర్శన్, రావిరాల కుమారస్వామి, యరసాని యాదయ్య, లింగస్వామి పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: మండలంలోని ఆరెగూడెం ప్రాథమిక పాఠశాలలో దశమి ఫౌండేషన్ సౌజన్యంతో విద్యార్థులకు నోట్‌బుక్కులు, యూనిఫారం, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దశమి లాబొరేటరీస్ హెచ్‌ఆర్ హెచ్‌ఓడీ టి. సురేంద్రబాబు, హెచ్‌ఆర్‌లు బి. కరుణాకర్‌రెడ్డి, ఎం. జగదీష్, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అరుణ, విజయసారథి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: స్వయంభు కాళికామాత ఆషాడమాస బోనాల పండుగ కరపత్రాన్ని దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మదేవర రవి శంకర్, కొండేటి శ్రీను, దికొండ ప్రకాష్, ఉయ్యాల శ్రీనివాసులు, పల్లెర్ల యాదగిరి, నాగయ్య, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

హాలియా: ఖాతాదారులు మెరుగైన సేవలు ఉపయోగించుకోవాలని హాలియా పోచంపల్లి బ్రాంచ్ బ్యాంక్ మేనేజర్ వీఎస్ కుమార్ కాసర్ల అన్నారు. బ్రాంచ్‌లో నిర్వహించిన ఖాతాదారుల సమావేశంలో మాటాడారు. సమావేశంలో బ్యాంక్ అడిటర్ జంగయ్య, సిబ్బంది మోహనచారి, రవీందర్‌రెడ్డి, వెంకన్న, పవన్, శాహీన్, బాలు, సైదులు పాల్గొన్నారు.

చింతపల్లి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని ఎస్ఎస్‌సీ బోర్డు స్టేట్ ఎగ్జామినర్ ఎ.కృష్ణారావు అన్నారు. చింతపల్లి మండల వేంకటేశ్వరనగర్(మాల్) జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో దస్త్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. మౌలిక వసతి సౌకర్యాల కల్పనకోసం తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

శాలిగౌరారం : తెలంగాణ మోడల్ స్కూల్ వల్లాలలో జూనియర్ విభాగం ఎన్‌సీసీలో విద్యార్థుల ప్రవేశానికి బుధవారం 31వ తెలంగాణ బెటా లియన్ ఎన్‌సీసీ నల్లగొండ నుంచి వచ్చిన ఆర్మీ సిబ్బంది సుబేదార్ చంకూర్‌సింగ్, హవల్దార్ మహ్మద్ ఇబ్రహీం హాజరై 45మంది విద్యార్థులను ఎంపిక చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి. రాగిణి మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్లకు క్రమశిక్షణ, దేశభక్తితో పాటు ఉన్నత విద్య ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్యాడెట్ జాల ఉదయ్, దండేపల్లి నికేష్, అంకిరెడ్డి స్పందన, చిత్తలూరి అనన్య ఎన్‌సీసీ అధికారి భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ క్రైం: నల్లగొండ వన్‌టౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని ట్రస్మా రాష్ట్ర, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ట్రస్మా రాష్ట్ర నాయకులు కొలనుపాక రవికుమార్, జిల్లా అధ్యక్షులు ముక్కాముల రాంమోహన్, పట్టణ అధ్యక్షుడు పోలోజు నాగేందర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నల్లగొండ రూరల్, నల్లగొండ టూటౌన్ ఎస్ఐగా పని చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో తనదైన ముద్ర వేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల శివకుమార్ తదితరులు సత్కరించారు.